నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
13 | హైదరాబాద్, శనివారం 23 మార్చి 2024 | RANGAREDDY


## బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు : ఎమ్మెల్యే యాదయ్య



నవాబుపేట, మార్చి 22 : తాను బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు కొందరు పని గట్టుకుని సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని, గులాబీ పార్టీని వీడే ప్రసక్తే లేదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తనపై నమ్మకంతో ఈ అవకాశాన్ని కల్పించారని దీనిని వమ్ముచేసి వేరే పార్టీలోకి ఎలా వెళ్తానని అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌కు కేసీఆర్ అవకాశం కల్పించారని, వారిని అధిక మెజార్టీతో గెలించేందుకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. జ్ఞానేశ్వర్ జడ్పీ చైర్మన్‌గా ప్రజలకు ఎన్నో సేవలు చేశారని గురు చేశారు. ఒక బీసీ బిడ్డకు కేసీఆర్ ఎంపీగా అవకాశం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉన్నదన్నారు. జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కానుకగా ఇద్దామన్నారు. మరోసారి చేవెళ్ల గడ్డపై గులాబీ పార్టీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## ‘ఉపాధి’ పనులు పూర్తి చేయండి

**వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి**



వికారాబాద్, మార్చి 22 : గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో కూలీల సంఖ్యను పెంచుతూ పనులను పూర్తి చేయాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. సీసీ రోడ్లకు సంబంధించి, లేబర్ మొబిలైజేషన్ తక్కువ ఉన్న గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పనులు మానిటరింగ్ చేసే ఒక వ్యక్తిని ప్రతి హ్యాబిటేషన్ కు ఏర్పాటు చేసి పనులు చేయించాలన్నారు. లేబర్ తక్కువ ఉన్న గ్రామాలపై దృష్టి పెట్టి గ్రూపులను ఏర్పాటు చేయాలన్నారు. లేబర్ సమావేశాలు నిర్వహించి, కూలీలను పెంచి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల చివరి వరకు పూర్తైన వాటికి ఎఫ్‌టీవో జనరేట్ చేయాలన్నారు. టెలికాన్ఫరెన్స్ లో డీఆర్‌డీఏ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఏపీవోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి

## సమన్వయంతో పనిచేయండి

**అక్రమ డబ్బు, మద్యం సరఫరాను అరికట్టండి**

**సీపీ అవినాశ్ మహంతి**

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ): రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి అధికారులకు సూచించారు. శుక్రవారం కమిషనరేట్‌లో రెవెన్యూ, ఆబ్కారీ, జీఎస్‌టీ, ఇన్‌కమ్ ట్యాక్స్, పోలీస్ తదితర శాఖల అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో సీపీ మాట్లాడారు. ఓటర్లను ప్రభావితం చేసే క్రమంలో అక్రమ డబ్బు పంపిణీ, రవాణా జరిగే అవకాశాలు ఉన్నాయని, దీనిని అరికట్టేందుకు పోలీసులతో పాటు ఐటీ, జీఎస్‌టీ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను వివరించారు. ఈ సారి ఉద్యోగులకు సంబంధించిన ఎపిక్ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చడమే కాకుండా ఓటు హక్కును వినియోగించుకునేందుకు 10రోజుల సమయాన్ని ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అంతే కాకుండా ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులందరికీ ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్(ఈడీసీ)లను జారీచేయనున్నట్లు తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రతి రోజూ సాయంత్రం 4గంటలకు డిస్ట్రిక్ట్ గ్రీవియన్స్ కమిటీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సైబరాబాద్ జాయింట్ కమిషనర్(ట్రాఫిక్) జోయల్ డెవిస్, మాదాపూర్ డీసీపీ డా.వినీత్, బాలానగర్ డీసీపీ శ్రీనివాస్‌రావు, మేడ్చల్ డీసీపీ నితిక పంత్, శంషాబాద్ డీసీపీ కె.నారాయణ రెడ్డి, రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**బలవంతంగా హోలీ రంగులు చల్లితే చర్యలు**

ఇష్టంలేని వారిపై బలవంతంగా హోలీ రంగులు చల్లితే కఠిన చర్యలు తప్పవని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి హెచ్చరించారు. అపరిచితులపై రంగులు చల్లకూడదని, పబ్లిక్ రోడ్లపై ఇతరులకు ఇబ్బంది కలిగించేలా బహిరంగంగా హోలీ ఆడకూడదని సీపీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలపై గుంపులుగా వీధుల్లో, బహిరంగ ప్రదేశాల్లో తిరగడం నిషేధమని, తిరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**మద్యం దుకాణాలు బంద్**

హోలీ పండుగ నేపథ్యంలో ట్రై కమిషనరేట్ల పరిధిలో ఈనెల 25 ఉదయం 6గంటల నుంచి 26 ఉదయం 6గంటల వరకు మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, కల్లు కంపౌండ్‌లను మూసివేస్తున్నట్లు పోలీసు కమిషనర్లు వెల్లడించారు.

## రివ్యూస్ రాయాలంటూ..

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ): రివ్యూస్ రాయాలంటూ.. పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరిట నగరానికి చెందిన ఓ వ్యక్తిని బురిడీ కొట్టించారు సైబర్‌నేరగాళ్లు. డ్రీమ్ డెవలప్‌మెంట్ పేరుతో రూపొందించిన గ్రూప్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగాల గురించి తొలుత చర్చించారు. హోటల్స్ ప్రమోట్ చేయడంలో భాగంగా రివ్యూస్ రాయాలంటూ నమ్మించారు. ఆ మాటలు నమ్మిన బాధితుడు.. వాళ్లు చెప్పినట్లు చేశాడు. మొదట కొన్ని హోటళ్ల పేర్లు ఇచ్చి.. వాటికి రివ్యూస్ రాయమని చెప్పారు. ఒక సెట్‌లో 30 హోటళ్ల పేర్లుంటాయి. ఇలా ఒక సెట్ పూర్తి చేస్తే వెయ్యి రూపాయలంటూ.. నమ్మించారు. మొదట బాధితుడికి రూ. 1000 మూడు సెట్ల వరకు మూడు వేలు ఇచ్చారు. ఆ తరువాత మీరు పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలొస్తాయంటూ నమ్మిస్తూ బాధితుడితో మొదట రూ. 25 వేలు, ఆ తరువాత రూ. 50 వేలు డిపాజిట్ చేయించారు. లాభాలొస్తున్నాయంటూ స్క్రీన్‌పై చూపిస్తూ.. మొత్తంగా రూ. 13,57,288 దోచేశారు. ఈ ఘటనపై బాధితుడిచ్చిన ఫిర్యాదుపై సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## కెమికల్స్‌తో అల్లం పేస్ట్

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ): రబ్బర్, ప్లాస్టిక్ తదితర వస్తువుల్లో ఉపయోగించే కెమికల్స్‌తో నకిలీ అల్లం వెల్లుల్లిని తయారు చేస్తూ మార్కెట్లో విక్రయిస్తున్న వ్యాపారిని ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. డీసీపీ రష్మిపెరుమాళ్ కథనం ప్రకారం.. లాలాపేటకు చెందిన నీల వెంకటేశ్వర్లు ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు నకిలీ అల్లం, వెల్లుల్లిని తయారు చేసి విక్రయించాలని ప్లాన్ చేశాడు. ఇందులో భాగంగా టైటానియం డైయాక్సైడ్, గ్జాథమ్‌గమ్‌లను కలిపి.. అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేసి, చిన్న వ్యాపారులకు సరఫరా చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు లాలాగూడ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు కలిసి తయారీ కేంద్రంపై దాడి చేశారు. 1300 కిలోల నకిలీ అల్లం, వెల్లులి పేస్ట్, 20 కిలోల కెమికల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ రసాయనాలు రంగుల కోటింగ్, పేపర్, ప్లాస్టిక్, రబ్బర్, పెయింట్స్‌లో ఉపయోగిస్తారు.

## హస్తం పార్టీలో ‘గోపి’లకే ఎంపీ టికెట్లు

- ఇలా చేరి.. అలా టికెట్ దక్కించుకున్న రంజిత్‌రెడ్డి
- ఫలించిన ఢిల్లీ లాబీయింగ్ !
- టికెట్ ఆశించి భంగపడ్డ పట్నం సునీతారెడ్డి
- నేతలంతా కలిసి పనిచేసే పరిస్థితిపై ఎన్నో అనుమానాలు
- లోక్‌సభ ఎన్నికల వేళ చేవెళ్లలో కాంగ్రెస్‌కు కొత్త చిక్కులు



గులాబీ సైనికులం అని ఇంతకాలం చెప్పకొని తిరిగిన నేతలంతా కండువాలు మార్చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే చేవెళ్ల ఎంపీ టికెట్ ఆశించి పట్నం సునీతారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆమెకే టికెట్ కన్ఫార్మ్ అనుకునేంతలోనే కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి టికెట్ దక్కించుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. అభ్యర్థి గెలుపు కోసం నేతలంతా కలిసికట్టుగా పనిచేసే పరిస్థితిపైనే ఎన్నో అనుమానాలు రేకెత్తుతున్నాయి. నేతల మధ్య సమన్వయం కుదురుతుందా!.. పాత, కొత్త పార్టీ కార్యకర్తలంతా కలిసిపోయి పనిచేస్తారా? అన్నది కోటి డాలర్ల ప్రశ్నగా మిగిలిపోవడం ఖాయంగా కనిపిస్తున్నది. ప్రస్తుతం పైకి అంతా బాగానే ఉన్నట్లు కనిపిస్తున్నా.. లోక్‌సభ ఎన్నికల ముంగిట చేవెళ్ల కాంగ్రెస్‌లో కొత్త చిక్కులు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. -రంగారెడ్డి, మార్చి 22 (నమస్తే తెలంగాణ)

# చేవెళ్ల కాంగ్రెస్‌లో చిక్కుముడులెన్నో!

చేవెళ్ల ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు వ్యూహ, ప్రతి వ్యూహాలకు పదును పెడుతున్నాయి. రెండు సార్లు గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని సంకల్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీ కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దింపింది. బీజేపీ నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బరిలో ఉన్నారు. కాంగ్రెస్‌కు సొంత అభ్యర్థిని నిలబెట్టుకోలేని పరిస్థితిలో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి గాలం వేసింది. అంతకుముందే ఈ ఎంపీ స్థానాన్ని ఆశించిన పట్నం సునీతామహేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కానీ.. అనూహ్యంగా రంజిత్‌రెడ్డికి పార్టీలో చేరిన కొద్ది రోజులకే కాంగ్రెస్ టికెట్‌ను ఖరారు చేసింది. టికెట్ కోసం రంజిత్‌రెడ్డి ఢిల్లీ స్థాయిలో చేసిన లాబీయింగ్ వల్లనే టికెట్‌ను కైవసం చేసుకున్నట్లు తెలుస్తున్నది.

**మౌనం వెనుక ఆంతర్యమేమిటో..**

చేవెళ్ల ఎంపీ టికెట్‌ను రంజిత్‌రెడ్డికి కేటాయించడం అనూహ్యంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కోసం అన్వేషణ మొదలు పెట్టక ముందే పట్నం సునీతామహేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. గత ఫిబ్రవరిలో చేవెళ్లలో భారీ బహిరంగ సభను నిర్వహించగా.. ఆ వేదికపైనే సునీతారెడ్డి పేరును ప్రకటిస్తారని అందరూ భావించారు. అలా.. అనేక సందర్భాల్లోనూ ఆమె అభ్యర్థిత్వంపై ప్రకటన వాయిదా పడుతూ వచ్చింది. ఆ తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల క్రమంలో సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి సైతం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపి పార్టీలో చేరారు. మొదటి నుంచీ టికెట్ ఆశించిన సునీతారెడ్డిని కాదని ఆ తర్వాత పార్టీలో చేరిన రంజిత్‌రెడ్డికే కాంగ్రెస్ అధిష్టానం టికెట్ ఖరారు చేసింది. చేవెళ్ల టికెట్ ఆశించిన సునీతకు కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి టికెట్ కేటాయించింది. కాంగ్రెస్ పార్టీ చివరలో ఇచ్చిన ట్విస్ట్ పట్నం కుటుంబీకులను ఒకింత నైరాశ్యం కలిగించేదే. అయినా..పట్నం కుటుంబీకుల నుంచి గానీ.. ఆ వర్గీయుల నుంచి గానీ.. ఎక్కడా అసంతృప్తి బహిరంగంగా వ్యక్తం కాలేదు. ఈ విషయంలో అంతా మౌనంగానే ఉంటూ వస్తున్నారు. ఈ మౌనం వెనుక ఆంతర్యమేమిటో! అన్నది సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది.

**కిందిస్థాయి క్యాడర్ సపోర్టు దక్కేనా !**

చేవెళ్ల ఎంపీ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా.. బీఆర్ఎస్ నాలుగు స్థానాలను, కాంగ్రెస్ మూడు స్థానాలను గెలుచుకున్నాయి. రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా లక్ష దాకా ఉండగా.. ఒకింత బీఆర్ఎస్‌కే ఎక్కువ అనుకూలత ఉన్నది. ఎంపీ రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో బలాబలాలు మారుతాయని కాంగ్రెస్ భావిస్తున్నది. అయితే కొత్త.. పాత నేతల మధ్య సమన్వయం కుదురుతుందా? అనేది కాంగ్రెస్ పార్టీతో పాటు పొలిటికల్ వర్గాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. పట్నం కుటుంబీకులకు చేవెళ్ల ఎంపీ పరిధిలో మంచి పట్టుంది. రంజిత్‌రెడ్డి గెలుపునకు పట్నం వర్గీయుల సహకారం చాలా అవసరం. చేవెళ్ల టికెట్ వస్తుందని గ్రౌండ్ లెవల్‌లో అంతా సిద్ధం చేసుకున్నాక.. టికెట్ చేజారడంతో నైరాశ్యంలో ఉన్న పట్నం వర్గీయుల నుంచి రంజిత్‌రెడ్డికి సహకారం అందేది సందేహాస్పదమే అవుతుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గ్రూపులతో సతమతమవుతున్న కాంగ్రెస్‌కు ఇప్పుడు రంజిత్‌రెడ్డి, పట్నంల మధ్య కో-ఆర్డినేషన్ ఏర్పర్చి లోక్‌సభ ఎన్నికల్లో ముందుకు సాగడం అనేది కాంగ్రెస్‌కు బిగ్ టాస్క్. ఈ విషయంపై అందరిలోనూ ఆసక్తి నెలకొన్నది.

## కాంగ్రెస్ శ్రేణుల గుర్రు

**రంజిత్‌రెడ్డికి వ్యతిరేకంగా వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం**

చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా రంజిత్‌రెడ్డిని ప్రకటించిన మరుసటి రోజు నుంచే సొంత పార్టీలో ముసలం మొదలైంది. రంజిత్‌రెడ్డికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఓ నియోజకవర్గం పేరుతో ఈ వాట్సాప్‌లో ప్రచారం జరుగుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించేందుకు రంజిత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారంటూ వాట్సాప్ గ్రూప్‌లో వైరల్ అవుతున్న ఈ ప్రచారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్న రంజిత్‌రెడ్డికి కాంగ్రెస్ శ్రేణుల సహకారం ఎంత వరకు ఉంటుందో ! అన్న సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సోషల్ మీడియాలో తాజాగా జరుగుతున్న ప్రచారం హాట్ టాపిక్‌గా మారింది.

# ఏప్రిల్ 4న బలపరీక్ష

**ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం వీగేనా..**

**కౌన్సిలర్లకు నోటీసులు అందజేసిన మున్సిపల్ అధికారులు**

ఇబ్రహీంపట్నం, మార్చి 22 : ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిపై 16 మంది కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఏప్రిల్ 4న బలపరీక్ష నిర్వహించటానికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన చైర్మన్ కప్పరి స్రవంతి గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆమెపై బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన 17మంది కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రవేశపెట్టగా వీగిపోయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరిపై అవిశ్వాస తీర్మానం పెట్టగా.. బలపరీక్ష నిర్వహించేందుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏప్రిల్ 4వ తేదీ నిర్వహించే బలపరీక్షకు హాజరుకావాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కౌన్సిలర్లకు నోటీసులను అందజేశారు.

**క్యాంపులో కౌన్సిలర్లు..**

చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టడంలో కీలకంగా వ్యవహరించిన వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిని దించేయాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రవేశ




పెట్టిన అవిశ్వాస తీర్మానానికి ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు పలికారు. దీంతో వైస్ చైర్మన్ పదవి ఆశిస్తున్న బర్ల మంగ కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లను ఇప్పటికే క్యాంపునకు తరలించారు.



# లక్ష్యానికి మించి..

- గనుల లీజుతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం
- ఈ ఆర్థిక సంవత్సరంలో 101 శాతం రెవెన్యూ
- చిన్న, పెద్ద తరహా గనుల ద్వారా రూ.115.04 కోట్లు రాక

వికారాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో మైనింగ్ లీజులతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతున్నది. పెద్ద, చిన్న తరహా గనుల ద్వారా ప్రతి ఏడాది రూ.100 కోట్లకుపైగా రెవెన్యూ ప్రభుత్వ ఖజానాకు చేరుతున్నది. ఇక ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి మించి ఆదాయం సమకూరింది. అధికారులు రూ.113.46 కోట్ల రెవెన్యూను టార్గెట్‌గా నిర్ణయించగా.. ఏకంగా రూ.115.04 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పటివరకు 101.39 శాతం మేర ఆదాయం ప్రభుత్వానికి చేరింది. ఇందులో పెద్ద తరహా గనుల లీజుతో రూ.27.08 కోట్లు, చిన్న తరహా గనుల లీజుతో రూ.87.95 కోట్లు వచ్చింది.

**నెలలవారీగా ఆదాయమిలా...**

గనుల లీజుతో ఆదాయం మైనింగ్ శాఖకు వచ్చిన ఆదాయాన్ని నెలలవారీగా పరిశీలిస్తే ఏప్రిల్‌లో రూ.10.68 కోట్లు, మేలో రూ.10.96 కోట్లు, జూన్‌లో రూ.12.76 కోట్లు, జూలైలో రూ.7.70 కోట్లు, ఆగస్టులో 9.30 కోట్లు, సెప్టెంబర్‌లో రూ.7.51 కోట్లు, అక్టోబర్‌లో రూ.8.49 కోట్లు, నవంబర్‌లో రూ.7.30 కోట్లు, డిసెంబర్‌లో రూ.8.73 కోట్లు, జనవరిలో రూ.8.93 కోట్లు, ఫిబ్రవరిలో రూ.15.47 కోట్లు, మార్చిలో ఇప్పటి వరకు రూ.7.18 కోట్లుగా ఉన్నది. అయితే జిల్లాలో ఎర్రమట్టి, సుద్ద గనులు, నాపరాయి, పలుగురాయి, సెల్డ్‌స్పార్, కంకర, గ్రానైట్ గనుల తవ్వకాలు జరుగుతున్నాయి. అదేవిధంగా జిల్లాలోని పెద్దేముల్, మర్పల్లి, వికారాబాద్, పరిగి మండలాల్లో 610 హెక్టార్ల విస్తీర్ణంలో 40 ఎర్రమట్టి గనులున్నాయి. అదేవిధంగా తాండూరు మండలంలో 100 హెక్టార్ల విస్తీర్ణంలో 160 నాపరాయి గనులున్నాయి. పెద్దేముల్, మర్పల్లి, ధారూర్ మండలాల్లో 41 హెక్టార్ల విస్తీర్ణంలో 65 సుద్ద, వికారాబాద్, దోమ మండలాల్లో 86 హెక్టార్లలో 34 కంకర గనులున్నాయి. తాండూరు మండలంలో 12 హెక్టార్లలో 6 గ్రానైట్ గనులుండడంతోపాటు దోమ మండలంలో 76 హెక్టార్లలో 6 పలుగురాళ్ల గనులున్నాయి.

**అక్రమ తవ్వకాలతో ఆదాయానికి గండి..**

జిల్లాలో గనుల అక్రమ తవ్వకాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నదనే విమర్శలున్నాయి. లీజు ఒకచోట, తవ్వకాలు మరోచోట అనే విధంగా కొంత ప్రాంతాన్ని లీజుకు తీసుకుంటున్న మైనింగ్ వ్యాపారులు లీజుకు తీసుకోని ప్రాంతాల్లో కూడా మైనింగ్ జరుపుతున్నా రెవెన్యూ అధికారులు, మైనింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే, తుతూ మంత్రంగా గనులకు వెళ్లి అక్కడున్న చిన్నచిన్న యంత్రాలను సీజ్ చేసి చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలున్నాయి. అదేవిధంగా కరెంట్ కనెక్షన్‌లో కూడా మోసం జరుగుతున్నది. సర్వే నెంబర్ పేరు ఒకటి ఉంటే, మరో చోట కనెక్షన్ తీసుకొని తవ్వకాలు జరుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ, విద్యుత్, మైన్స్, పోలీసు అధికారులు సంయుక్తంగా దాడులు చేస్తేగానీ అక్రమ తవ్వకాలకు అడ్డుకట్టపడే అవకాశం లేదు. అంతేకాకుండా కొన్ని మైనింగ్ సంస్థల వ్యవహారంతో జిల్లాకు రావాల్సిన రాయల్టీ విషయంలోనూ నష్టం జరుగుతున్నదనే విమర్శలున్నాయి.

### అక్రమ గనుల తవ్వకాలపై దృష్టి పెట్టాం..



ఈ ఆర్థిక సంవత్సరం ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్‌కు మించి ఆదాయం వచ్చింది. అదేవిధంగా అక్రమ మైనింగ్ తవ్వకాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాం. మైనింగ్ ప్రాంతాలను తనిఖీలు చేసి అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేస్తాం.

– సత్యనారాయణ, జిల్లా మైనింగ్ శాఖ ఏడీ

# తల్లీకుమార్తె తెగువకు సెల్యూట్

**అభినందించిన డీసీపీ రోహిణి ప్రియదర్శిని**

**బేగంపేటలోని రసూల్‌పుర ఘటనలో ఇద్దరు దుండగుల అరెస్టు**

**ఆయుధాలు స్వాధీనం**

సిటీబ్యూరో, మార్చి 22 (నమస్తే తెలంగాణ): బేగంపేటలోని రసూల్‌పురాలో ఇద్దరు దుండగులు తుపాకీ గురిపెట్టినా.. వెరవని..తల్లీకుమార్తెల ధైర్య సాహసాలకు సర్వత్రా ప్రశంసలందుతున్నాయి. నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని తల్లీకూతుళ్ల ధైర్యాన్ని అభినందిచారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఆమె శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఖాన్‌పూర్‌కు చెందిన సుశీల్‌కుమార్ , ప్రేమ్ చంద్ర దోపిడీకి ప్లాన్ చేశారు. ఇందులోభాగంగా బేగంపేటలోని ఓ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారు. ఈ క్రమంలోనే ఆ ఇంట్లోకి చొరబడి అందిన కాడికి దోచుకుపోయేందుకు గురువారం వచ్చారు. సుశీల్‌కుమార్ హెల్మెట్ ధరించగా, ప్రేమ్‌చంద్ర ముఖానికి మాస్క్ ధరించి.. తలకు టోపీ పెట్టుకున్నాడు. తలుపు వద్దకు వచ్చి ఇంటి యజమానురాలైన అమిత మహ్నోట్ పేరు పిలుస్తూ.. ఎన్‌కే జైన్ పేరుతో కొరియర్ వచ్చిందంటూ చెప్పాడు. ఇంతలో పనిమనిషి ఆ కొరియర్ తీసుకునేందుకు రాగా, ప్రేమ్ చంద్ర ఇంట్లోకి చొరబడ్డాడు. కిచెన్‌లోకి వెళ్లి పని చేసే మహిళ మెడకు కత్తిపెట్టాడు. సుశీల్ తలుపు వద్ద ఉన్నాడు. ప్రమాదాన్ని పసిగట్టిన అమిత కూతురు తలుపు వద్ద ఉన్న సుశీల్‌పై దాడి చేసింది. ఆమె తల్లి అమిత అక్కడకు చేరుకొని.. తుపాకీ ఉన్నా..భయపడకుండా.. ఇద్దరు కలిసి సుశీల్‌ను చితకబాదారు. అతడి వద్ద ఉన్న తపంచాను లాక్కొన్నారు. తల్లీకూతుళ్ల దాడికి.. అక్కడి నుంచి సుశీల్ పరారయ్యాడు. బయట జరుగుతున్న కొట్లాటను గుర్తించకుండా లోనే ఉండిపోయిన ప్రేమ్ చంద్ర.. ఆలస్యంగా బయటికి రావడంతో అతడిపై కూడా దాడి చేసి.. స్థానికుల సహాయంతో పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అప్పటికే పారిపోయిన సుశీల్‌ను సైతం పట్టుకున్నారు. నిందితులిద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి తపంచా, రబ్బరు బుల్లెట్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలాఉండగా అమితకు కిక్ బాక్సింగ్, కరాటేలో అనుభవం ఉండటంతో భయపడకుండా దొంగలతో వీరోచితంగా పోరాడగా, ఆమె కూతురు కూడా ధైర్యసాహసాలను చూపించింది. కాగా, సీసీ కెమెరాల్లో రికార్డయిన తల్లీకూతుళ్ల వీరోచిత పోరాట దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. వాటిని చూసిన ప్రతి ఒక్కరూ శభాష్ అంటూ ప్రశంసిస్తున్నారు.



దుండగులను ధైర్యంగా ఎదుర్కొన్న తల్లీకూతురును సన్మానిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని